ఎరువు..బరువు!

- కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచిన కూటమి ప్రభుత్వం
- ఒక్కో బస్తాపై ధర రూ.100–150 వరకు పెంపు
- సబ్సిడీకి మంగళం
- ఆందోళనలో రైతాంగం


దూకాణంలో ఎరువులు తీసుకెళ్తున్న రైతులు


మంత్రాలయం వద్ద సాగు చేసిన మిరప

మంత్రాలయం : వ్యవసాయంపై ఆనాటి నుంచి చంద్రబాబుది ఒక్కటే అభిప్రాయం. వ్యవసాయం దండగ అన్న రోజులు మళ్లీ గుర్తు చేస్తున్నారు. అందుకు నిదర్శనమే రైతులపై ఈ ఎరువుల భారం. సాగు గిట్టుబాబు కాక ఎందరో రైతన్నలు పిట్టల్లా నేల రాలుతున్నారు. అయినా కూటమి ప్రభుత్వానికి కాసింత కరుణ లేకపాయె. పండిన ధాన్యాలకు ధరలు నేలచూపు చూస్తున్నా కాంప్లెక్స్ భారం మాత్రం దించలేకపోయింది. కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీ పెంచకపోగా.. ఒక్కో బస్తాపై ఏకంగా రూ.100 నుంచి రూ.200 వరకు పెంచడంతో రైతన్నలపై వడంతో తేరుకోలేని భారం పడింది. పంటలకు ఎరువులు వేయాలంటేనే కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ ఇచ్చి ఆదుకునేదని గుర్తు చేసుకుంటున్నారు.

1.82 లక్షల ఎకరాల సాగు భూమి

మంత్రాలయం నియోజకవర్గంలో 1.82 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. మంత్రాలయంలో 35 వేలు, కోసిగిలో 44 వేలు, పెద్దకడబూరులో 36 వేలు, కౌతాళం 67 వేలు ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. అత్యధికంగా పత్తి సాగుచేస్తుండగా వేరుశనగ, మిరప, వరి, ఉల్లి పంటలు వేస్తున్నారు. నియోజకవర్గంలో 90 శాతం ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

1442 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం

ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి యూరియా 1,442 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,102 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 2,127 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయి. అధికంగా కౌతాళం మండలానికి యూరియా 530 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 832 మెట్రిక్ టన్నులు, డీఏపీ 440 మెట్రిక్ టన్నులు వినియోగిస్తున్నారు. మిగతా మండలాల్లో 250 నుంచి 300 మెట్రిక్ టన్నులు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వాడుతున్నారు.

కాంప్లెక్స్ ఎరువులపై ధర పెంచిన కూటమి ప్రభుత్వం

పంటల సాగుకు అధికంగా కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సి వస్తోంది. యూరియా మినహా ప్రతి కాంప్లెక్స్ ఎరువుపై కూటమి ప్రభుత్వం ధరలు పెంచేసింది. కాంప్లెక్స్ కంపెనీలకు సబ్సిడీ పెంచకపోవడంతో ఆ భారమంతా రైతుల నెత్తిన పెట్టారు. కారణంగా రైతులు ఎరువులు కొనలేక నానా తంటాలు పడుతున్నారు. ఏకంగా రూ.100–150 పెంచడంతో రైతులకు భారంగా మారింది. నియోజకవర్గ రైతులపై దాదాపు కోటిన్నరకుపైగా భారం పడింది.

వ్యాపారుల దందా

కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్ బస్తాపై రూ.100–150 పెంచగా డీలర్లు ధరల పెంపు ముసుగులో దందా చేసేస్తున్నారు. వంద పెరిగిన బస్తాపై రూ.150, నూటయాభై పెంచిన బస్తాపై రూ.200 అధికంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా డిమాండ్ ఉన్న 28.28.0.13, 14.35.14. 10.26.26.0 ఎరువులపై అదనంగా వడ్డిస్తున్నారు. అసలే పండిన పంటలకు మార్కెట్లో ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారు. వర్షాభావం, తెగుళ్ల బెడదతో రైతులకు అరకొరగా దిగుబడి వచ్చింది. మార్కెట్లో పత్తి రూ.6000–6500, మిరప రూ.10,000–12,000 వరకు మాత్రమే ధర పలుకుతోంది. మిరప పెట్టుబడులకు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం, డీలర్లు దోపిడీకి పాల్పడటంపై కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం పెంచిన ధరలు ఇలా..

ఎరువులు	పాత ధర	కొత్త ధర
28.28.0.	రూ.1680	రూ.1800
14.35.14	రూ.1680	రూ.1800
20.20.0.13	రూ.1100	రూ.1300
10.26.26	రూ.1370	రూ.1470
16.20.0.13	రూ.1100	రూ.1250
24.24.0.08	రూ.1700	రూ.1800
పొటాష్	రూ.1550	రూ.1650
యూరియా	రూ.266.5	రూ.266.5
డీఏపీ	రూ.1350	రూ.1450

పెట్టుబడి భారం పెరిగింది



కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెరగడంతో పెట్టుబడి భారం అమాంతంగా పెరిగిపోయింది. కూలి రేట్లు కూడా అధికంగా ఉన్నాయి. ఒక్కో బస్తాపై ఏకంగా రూ.100–150 పెంచడం దారుణం. ప్రభుత్వం ఎరువుల ధరలపై పునరాలోచించాలి. రైతులకు భారం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– అప్పసాని రాజ్‌కుమార్, రైతు, మంత్రాలయం

కొనలేక పోతున్నాం



ప్రభుత్వం ఎరువులు రేట్లు పెంచడంతో కొనలేకపోతున్నాం. పంటల పోషణకు ఎరువుల చల్లాలంటేనే కష్టంగా ఉంది. తమలాంటి సన్నకారు రైతులు ఎరువులు కొనాలంటే ఇబ్బంది. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు కాంప్లెక్స్ ఎరువులు కొనాలంటేనే వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం ఎరువుల ధరలు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

– మోదీన్, రైతు, మంత్రాలయం

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: టణంలోని అక్షర జూనియర్ కళాశాలలో బుధవారం ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల్లోపు విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపరాదన్నారు. అలాగే విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు గానీ, ర్యాగింగ్‌కు గానీ, సైబర్ నేరాలు, గంజాయి వంటి వాటికి పాల్పడకుండా మంచిమార్గంలో నడిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ గురించి విద్యార్థులు తెలుసుకుని వాటిని ఇతరులు కూడా పాటించేలా చూడాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్

మంత్రాలయం: ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్.కే.కంటి వైద్యులు డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీ మఠం వైద్యశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు అన్నారు. బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. దాదాపు 175 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 50 మందిని ఆపరేషన్ల ఏర్పాట్లు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పీఠాధిపతి శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

గోనెగండ్ల : భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ కుమార స్వామి తెలిపారు. బుధవారం ఎర్రబాడులో సమస్య ఉన్న భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ఇటీవల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. అందులో దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలకు వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రిసర్వే డిప్యూటీ తహసీల్దార్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంను మెనూ ప్రకారం అందించాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. మండలంలోని ఎర్రబాడు గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి


ముగతిలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ పుల్లయ్య, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ ప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ బిల్లులను సకాలంలో చెల్లిస్తామని వివరించారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


వాగి శంకర్ రెడ్డి


ధీరజ్ రెడ్డి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని లీలాస్ పాఠశాల విద్యార్థులు వాగి శంకర్ రెడ్డి, ధీరజ్ రెడ్డి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి, కార్యదర్శి ప్రతిభా బాయ్ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన క్రికెట్ అండర్–14 పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28 అంటే నేటి నుంచి 30వ తేదీ వరకు అమలాపురంలో జరిగే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టారమేష్, సహాయ అధ్యక్షులు భూపాల్ చౌదరి, మల్లప్ప, ముజిబ్ అహ్మద్, కార్యదర్శి వెంకటేష్, కోచ్ బాలాజీ, పీఈటీ కళ్యాణ్ అభినందించారు.

వైభవంగా ఆర్యవైశ్యుల వనభోజనం


భోజనాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

మంత్రాలయం: స్థానిక అభయాంజనేయ్యస్వామి వెనుక భాగంలో ఉన్న ఉసిరివనంలో బుధవారం ఆర్యవైశ్యులు కార్తీక వన భోజన కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నారాయణశెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొని సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించి ఉరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భోజన కార్యక్రమం చేపట్టారు.

సైబర్ నేరాలపై అవగాహనుండాలి



మాట్లాడుతున్న న్యాయవాది లలిత

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది లలిత అన్నారు. బుధవారం ఆదోని అర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎవరైనా ఫేక్ కాల్స్ ద్వారా బెదరిస్తే భయపడకుండా సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడికి వెళ్లలేని పరిస్థితులో ఆన్‌లైన్‌లో (ఎన్‌సీఆర్‌పీ) జాతీయ సైబర్ క్రైమ్ రిజిస్టరింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. నేడు చాలమంది మొబైల్‌ల్లో తెలియని లింక్‌లను క్లిక్ చేసి డబ్బులను పోగొట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జోనాథన్ విక్టేఫ్, ఉమాదేవి, వెంకట్రామి రెడ్డి, మధు, వెంకటేశ్వర్లు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయండి


గోనెగండ్లలో స్వర్ణపంచాయతీ ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

గోనెగండ్ల : స్వర్ణ పంచాయతీలో భాగంగా ఇళ్లను ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు తప్పులు లేకుండా పకడ్బందీగా చేయాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ సూచించారు. బుధవారం మండలం కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ విధానాన్ని డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న గృహాల వారు తప్పనిసరిగా స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో తమ గృహాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో ఉన్న గృహాల వారు 2024–25 సంవత్సరానికి చెందిన ఇంటి పన్ను చెల్లించి స్వర్ణ పంచాయతీలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సతీష్, సిబ్బంది ఉన్నారు.

కౌతాళంలో అభివృద్ధి పనులు


వైఎస్సార్ నగర్‌లో గ్రావెల్‌రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని వైఎస్సార్ నగర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను మండల కన్వీనర్ ప్రహ్లదచారి ఆధ్వర్యంలో సర్పంచ్ పాల్‌దినకర్ ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. వైఎస్సార్ నగర్‌లోని మూడు రోడ్డుల్లో డ్రైనేజీ నిర్మాణంతో పాటు సిమెంటు రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, వడ్డెరామన్న, అబ్దుల్‌సమద్ పాల్గొన్నారు.

శ్రీ మఠంలో ద్వాదశి వేడుకలు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం ద్వాదశి వేడుకలను పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, గజ, వెండి ,బంగారు, నవరత్న రథోత్సవాలపై కొలువుంచి శ్రీ మఠం మాఢ విధుల్లో ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీమఠం అందికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రాలయం సీఐ రామంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మా బాధ ఎవరికీ రాకూడదు!


కోట్ల కూడలిలో ఏర్పాటు చేసిన బ్యానర్

ఆదోని అర్బన్: కుమారుడిని పోగొట్టుకున్న తల్లిదండ్రులు తమ ఆవేదనను సమాజానికి తెలియజేయడంతో పాటు అందరినీ ఆలోచించేలా చేశారు. ఆదోని పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన హనుమన్న, శివమ్మ దంపతుల మొదటి కుమారుడు భార్గవ్ (19) గత నెల 29వ తేదీన రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి బాధ ఏ తల్లిదండ్రులకు రాకూడదని, పట్టణంలో ప్రధాన కూడలిలో ఆ యువకుడి అభిమాన సినీ నటుడు అల్లు అర్జున్ సినిమా పుష్ప–2 బ్యానర్ ఏర్పాటు చేసి అందులో పిల్లలకు, తల్లిదండ్రులకు గమనిక అంటూ ఆవేదనను వెల్లిబుచ్చారు. పెద్దలకు గమనిక అంటూ 'పిల్లలను వాళ్ల ఇష్టాన్ని గౌరవించి మీ దారికి తెచ్చుకునేలా ప్రయత్నం చేయండి' అని, అలాగే పిల్లలకు గమనిక అంటూ.. 'తల్లిదండ్రులను అర్థం చేసుకోండి. క్షణికావేశంలో వాళ్లకు కడుపు కోత మిగిల్చకండి' అని సందేశమిచ్చారు. ఈ బ్యానర్‌ను చూసిన పాదచారులు, వాహనదారులు పిల్లల పెంపకంపై చర్చించుకోవడం కనిపించింది.

29న జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా, జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ అధికారి ఆనంద్‌రాజ్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్‌బాబు సెల్ నెంబర్ 88859 04099కు సంప్రదించాలన్నారు.

5 నుంచి క్రికెట్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని డిసెంబర్ 5వ తేదీ నుంచి నిర్వహించనున్న మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నీ పోస్టర్లను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. టోర్నీ ఫైనల్ పోటీలు జనవరి 15వ తేదీన నిర్వహిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టోర్నీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

మెప్మా బజార్ పరిశీలన

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను బుధవారం ఎమ్మెల్యే బీవీ పరిశీలించారు. పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మెప్మా సీఎంఎం జయవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత రైతును ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆరబోసిన మిరప పంట దిగుబడికి గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేయడంతో తీవ్రంగా నష్టపోయిన ఎర్రకోట గ్రామ రైతు శ్రీనివాసులును ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎర్రకోట గ్రామ సమీపంలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద నాలుగు క్వింటాళ్లకు పైగా మిరప పంటను ఆరబోసి రాత్రి భోజనానికి రైతు శ్రీనివాసులు వెళ్లాడని తెలిపారు. ఆసయంలో ఆరబోసిన పంటపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారన్నారు. దీంతో రూ.2లక్షలు నష్టపోయాడని, బాధిత రైతును ఆదుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు ,సురేష్, ఎల్లప్ప, పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రోడ్డు సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆదోనిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువ ఉన్నందువల్ల వీటిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని ఆలూరు రోడ్డు మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చి (ఆదోని ముఖ ద్వారం), గోశాల సమీపంలో ఉన్న మలుపు వద్ద, ఎమ్మిగనూరు బైపాస్ విమల రీజెన్సీ వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీ అధికారులు ఉమ్మడిగా కలిసి బ్లాక్ స్పాట్స్, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. సమావేశంలో ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డీఎల్‌పీఓ నూర్జహాన్ పాల్గొన్నారు.

పౌర సరఫరా గోదాము తనిఖీ

ఆదోని పౌర సరఫరాల గోదామును బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. గోదాములో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్ వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపుర కలశ స్థాపన


గోపుర కలశ స్థాపన చేసిన దృశ్యం


ఆలయ ప్రాంగణంలో హోమాలు చేస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే గేటు సమీపంలోని శ్రీ సిద్ధరూఢస్వామి ఆలయ గోపుర కలశ స్థాపన ఘనంగా చేపట్టారు. బుధవారం కార్తీక మాసం కృష్ణపక్షం ద్వాదశిని పురస్కరించుకుని వేకువ జామున నుంచి సిద్ధరూఢ స్వామికి వేదపండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు గావించి , ఫలపుష్పాలంకరణలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించి గోపుర శిఖర కలశ స్థాపన చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహులు, కుమార్ దొర, ముకుంద కృష్ణమూర్తి, వీఆర్వో వెంకటరెడ్డి, పూజారి మూర్తి గౌడ, అయ్యన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న కుటుంబానికి పరామర్శ


ఆసుపత్రిలో ఈరన్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు గ్రామానికి చెందిన ఈరన్న కుటుంబంపై ఈనెల 24న అదే గ్రామానికి చెందిన కొంతమంది బీసీ కులస్తులు దాడి చేశారు. దాడిలో గాయపడ్డ ఈరన్న, అతని కుమారుడు కృష్ణ, కృష్ణ భార్య లక్ష్మి ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని బుధవారం దళిత సమాఖ్య నాయకులు పరమర్శించి, అండగా ఉంటామని భోరసా ఇచ్చారు. విజయ్‌కుమార్, కాత్రికి ప్రకాశ్, మరోశ్ ముఖేశ్‌లు మాట్లాడుతూ ఈరన్న అతని కుటుంబంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని డిమాండు చేశారు. వారి వెంట చూడి అబ్రహం, బదినేహాల్ ఈరన్న, నదిచాగి ఉసేని పలువురు ఉన్నారు.

బాల్యవివాహాలు సాంఘిక దురాచారం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నిసా

ఎమ్మిగనూరు రూరల్: బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నిసా అన్నారు. బుధవారం మండలంలోని గుడికల్ గ్రామ బాలికల జెడ్పీ హైస్కూల్‌లో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాలికల విద్య, రక్షణ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్నారు. వారి కలలను సాకారం చేసుకునే అవకాశాన్ని దూరం చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్‌ఎం నరసప్ప, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే

ఆదోని అర్బన్: పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఎమ్మెల్యే డా.పార్థసారథి కార్యక్రమంలో పాల్గొని, అంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

రేపు ఉరుకుందలో సుదర్శన హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఈనెల 29 శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కల్గిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.